క్లుప్తంగా

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



మంగళగిరి: రౌడీ షీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ వినోద్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం పట్టణ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. భూ వివాదాలు, సెటిల్మెంట్‌లు, అధిక వడ్డీలతో ప్రజలను ఇబ్బంది పెడితే చట్ట ప్రకారం క్రిమినల్ తీవ్ర చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు పాలస్తీనా సంఘీభావ దినం



తాడేపల్లిరూరల్ : పాలస్తీనాపై ఇజ్రాయెల జరుపుతున్న దాడులను వ్యతిరేకిస్తూ సోమవారం సాయంత్రం 5 గంటలకు తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ దినాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య తెలిపారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తున్నామన్నారు. సోమవారం సాయంత్రం జరిగే పాలస్తీనా సంఘీభావ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీపీ భాస్కర్‌రెడ్డి, వై.బర్నబాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రాడ్యుయేట్ ఎన్నికలపై అవగాహన సదస్సు

తాడేపల్లిరూరల్ : నేడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో మంగళగిరి బైపాస్ రోడ్డులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరుగుతుందని, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకాభిప్రాయంతో మాజీ ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డిని నిర్ణయించారని తెలిపారు. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని.. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, చేనేత విభాగ రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, తాడేపల్లి మంగళగిరి పట్టణ రూరల్ అధ్యక్షులు, దుగ్గిరాల మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, ఈ కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలని కోరారు.

కాంగ్రెస్ చేనేత విభాగం అధ్యక్షుడిగా పూర్ణచంద్రరావు



మంగళగిరి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పార్టీ నాయకుడు రామనాథం పూర్ణచంద్రరావును ఎంపిక చేస్తూ ఏపీపీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ నూతన చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పూర్ణచంద్రరావును పార్టీ నాయకులు రామనాథం పూర్ణ చంద్రరావు(కాజ), కోటేశ్వరరావు, బాలకృష్ణ, బోసుబాబు, భాస్కర్ అభినందించారు.

ఇసుక లారీ స్వాధీనం

తాడికొండ: తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకొని, వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం తెల్లవారుజామున ఉద్దండరాయునిపాలెం నుంచి ఇసుక లోడ్ చేసుకొని వస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి 15 టన్నుల ఇసుక, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



ఐనవోలు(తాడికొండ): తుళ్ళూరు మండలం ఐనవోలు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సివిల్ సప్లైస్ అధికారులు ఆదివారం తెలిపారు. ఐనవోలు గ్రామానికి చెందిన పులివెలుగుల రాజు అక్రమంగా బియ్యం నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు ఐసీఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సీఎస్ డీటీ దేవరాజు, సీఎస్ సీనియర్ అసిస్టెంట్ అనీల్, సిబ్బంది పాల్గొన్నారు.

జగజ్జననికి జేజేలు



మంగళగిరి: విజయలక్ష్మీ అలంకరణలో రాజ్యలక్ష్మీ అమ్మవారు



విజయకీలాద్రిపై సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారికి పూజలు



మంగళగిరి: శివాలయంలో ధనలక్ష్మీగా అమ్మవారి దర్శనం



తాడికొండ: పాములపాడులో కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



తాడేపల్లి రూరల్: ఉండవల్లి రెడ్ల రామ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తాడేపల్లి రూరల్: మున్సిపల్ కార్యాలయం వద్ద లలితా త్రిపురసుందరి దేవికి పూజలు

మంగళగిరి/తాడేపల్లి రూరల్: పట్టణంలో దసర శరన్నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలగవ రోజు శనివారం అమ్మ వారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రత్నాల చెరువు ఫర్ సేల్

- పట్టా స్థలం సెంటు రూ.5 లక్షలు..
- కానీ, కబ్జా స్థలం రూ.లక్షే..
- బంపర్ ఆఫర్ ఇస్తున్న ఆక్రమణదారులు
- ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేశాం..
- ఇప్పుడు అధికార నేతల అండతోనే ఆక్రమిస్తున్నాం..
- కొనుగోలుదారులకు వింత భరోసా..
- రచ్చకెక్కుతున్న ఆక్రమణదారుల ఆదిపత్య పోరు..
- ఫిర్యాదు చేస్తే..బదులిస్తున్న బెదిరింపులు



ఆక్రమణలో రత్నాల చెరువు

మంగళగిరి: ఆక్రమణదారులకు బంగారు గుడ్లు పెట్టే బాతుగా పట్టణంలోని రత్నాల చెరువు మారింది. గత మూడు నెలల వరకు మున్సిపల్ స్థలం ఆక్రమించాలంటేనే హడలిపోయిన వారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపాల్టిలో ఖాళీ స్థలం కనిపిస్తే ధైర్యంగా పాగా వేస్తున్నారు. రత్నాల చెరువులో పట్టా స్థలం సెంటు రూ.5 లక్షలకు పైగా పలుకుతుండగా ఆక్రమణదారులు రూ.లక్షల నుంచి రూ.2 లక్షలకే విక్రయిస్తుండడం గమనార్హం. మున్సిపల్ స్థలం ఆక్రమించి, అధికార పార్టీ నాయకుల అండతోనే ఆక్రమిస్తున్నామని.. కొనేవారు భయపడాల్సిన పనిలేదని ధైర్యంగా చెప్పి విక్రయిస్తుండడం విశేషం. ఆక్రమణదారుల్లో కొనసాగుతన్న ఆధిపత్య పోరు వివాదాలకు దారితీస్తోంది. రత్నాల చెరువులో గత ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపునకు తామే కృషి చేశామని, పార్టీ నాయకులు తమనే ఆక్రమించుకోమని చెప్పారని వారు పోరాడుతున్నారు. దీంతో వారి మధ్య రోజూ గొడవలు జరుగుతుండడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. శనివారం రత్నాల చెరువులో ఆక్రమణదారుల గొడవ పెద్దది కావడం స్థానికంగా సంచలనం రేపింది. మరికొందరు కబ్జాదారులు తాము చేసిన ఆక్రమణ స్థలాలకు నకిలీ పట్టాలు, దస్తావేజులు పుట్టించి విక్రయిస్తుండడం విశేషం. పలువురు ఆక్రమణదారులపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదై ఉన్నాయి. మున్సిపల్ స్థలాల ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఫిర్యాదు చేసిన వారిని సైతం ఆక్రమణదారులు బెదిరిస్తుండడంతో బాధితులు భయపడుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ఆక్రమణలను అడ్డుకుని మున్సిపల్ స్థలాలను రక్షించి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు. ఆక్రమణల విషయమై తహసీల్దార్ ఎస్కే సుభానిని వివరణ కోరగా విచారణ చేసి ఆక్రమణ స్థలాలను రక్షించడంతో పాటు ఆక్రమణ దారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రత్నాలచెరువులో ఆక్రమణలను పరిశీలించి, ఆక్రమిత స్థలాలను స్వాధీనం చేసుకుంటామన్నారు.

అర్జీలతో రండి..జయప్రదం చేయండి

రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : పంట నష్ట పరిహారం అందని కౌలు రైతులు తమ అర్జీలను తీసుకుని విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అన్నారు. ఆదివారం దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి, చిలువూరు గ్రామాల్లోని రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరద ముంపు కారణంగా పంట నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివశంకరరావు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన కృష్ణానది వరదలు, అధిక వర్షాల కారణంగా ఈ ప్రాంతాల్లోని పంటలన్నీ జలమయమయ్యాయని అన్నారు. ప్రభుత్వం వరి ఎకరానికి రూ.10 వేలు, వాణిజ్య పంటలకు రూ.14 వేలు నష్టపరిహారం ప్రకటించిందని, ముఖ్యమంత్రి కౌలు రైతులకు ఇస్తామన్న ప్రకటన పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు. గ్రామాల వారీగా నష్టపరిహారం అందని కౌలు రైతులు అందరూ అర్జీలు తీసుకుని మంగళవారం తరలి రావాలని పిలుపునిచ్చారు. వరికి ఎకరాకు రూ.25 వేలు, కంద, పసుపు మిగిలిన వాణిజ్య పంటలకు రూ.60 వేల నుంచి లక్ష రూపాయల వరకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. హామీ ఇచ్చిన విధంగా అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి వై. బ్రహ్మేశ్వరరావు, బి. అమ్మిరెడ్డి, జి. యోహాను, ఎస్. శ్రీనివాస్, బి.ప్రసాద్, సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం



నెల నుంచి తొలగించకపోవడంతో ఎస్సీ కాలనీ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

తాడికొండ: మండల కేంద్రంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పేరుకే మేజర్ పంచాయతీ కానీ, పారిశుద్ధ్యం విషయంలో మైనర్‌గానే మిగిలిపోయింది. ఇక్కడ అరకొరగా ఉన్న పారిశుద్ధ్య సిబ్బంది తమ విధులను ప్రధాన రహదారులకే పరిమితం చేస్తున్నారు. రాజకీయ నాయకుల బజార్లు చుట్టూ చెక్కర్లు కొట్టి శివారు కాలనీలను గాలికొదిలేస్తున్నారు. ఈ కారణంగా నెలల తరబడి చెత్తను తొలగించేవారు లేక పేరుకుపోయి ముక్కుపుటాలు అదిరే దుర్వాసన వెదజల్లుతోంది. తాడికొండ ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారితో పాటు పలు శివారు కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హి సేవ పేరుతో ర్యాలీలు నిర్వహించి, ఫోటోలకు ఫోజులిచ్చిన అధికారులు ఎక్కడా ఆ చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి, సత్వరమే చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు.

వరిలో సస్యరక్షణ అవసరం



చిరు పొట్ట దశలో ఉన్న వరి

కొల్లిపర: ప్రస్తుతం వరి చేలు పొట్ట, చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని కొల్లిపర మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు పేర్కొంటున్నారు. వరిసాగులో పాటించాల్సిన మెలకువలపై ఆయన సలహాలు సూచనలు... వరికి మోతాదుకు మించి యూరియా వేస్తే అనేక తెగుళ్ల వ్యాపిస్తాయి. వరి పంటకు చిరు పొట్ట దశలో ఎకరానికి 40 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలపి వేయాలి. పంటకు నీరు అధికంగా పెట్టాలి. పొట్ట దశలో వరి పంటకు ప్రధానంగా అగ్గితెగులు, పాముపొడ తెగులు , దోమపోటు లాంటి తెగుళ్ల అధికంగా వ్యాపిస్తాయి. సన్న రకం ధాన్యం పంటలో ఈ తెగుళ్ల అధికంగా వ్యాపిస్తాయి. వరి కర్ర మొదట్లో చిన్న చిన్న పురుగులు నీటి మట్టం పైకి పాకుతుంటాయి. ఈ పురుగుల నివారణకు ఎకరానికి 350 మి.లీ బ్రొఫ్రోజిన్ పిచికారీ చేయాలి. పాము పొడ తెగులు, అగ్గి తెగులు మోతాదుకు మించి యూరియా వేయడం వల్ల వ్యాపిస్తాయి. వరి పంట ఆకుపై ఇటుక పొడి రంగులో నూలు కండె ఆకారపు మచ్చలు ఏర్పడితే అగ్గితెగులుగా గుర్తించాలి. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. కాండం మీద నల్లటి మచ్చలు ఏర్పడితే పాముపొడ తెగులుగా గుర్తించాలి. దీని నివారణకు హెక్సాకోనాజోల్ 400 మిలీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలపి పిచికారీ చేయాలి. రెండు కలిసి ఉంటే 400 మిలీ లీటర్ల టెబుకోనాజోల్ పిచికారీ చేయాలి. మానుపుండు తెగులు నివారణకు ఎకరానికి 200 మిలీ ప్రొపికొనాజోల్ 200 లీటర్ల నీటిలో కలపి పిచికారీ చేయాలని సూచించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ ఆడిటోరియంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పూర్వ విద్యార్థి నంబూరి సుందరరావును పూర్వ విద్యార్థులు సన్మానించారు. పల్నాడు జిల్లా గుత్తికొండలో సుందరరావు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఇటీవల నరసరావుపేటలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. సెయింట్ పాల్స్ హైస్కూల్ లో 1987తో చదువుకోవడంతో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సుందరరావును సన్మానించి, అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థులు కె.శ్రీదర్‌రెడ్డి, సింగయ్య, పి.వెంకటేశ్వర్లు, శ్రీధర్, తాతారావు, మరియన్న, జోజప్ప, కె,కోటేశ్వరరావు, దాచేపల్లి శేషు, ఆర్, రమణ, శ్రీను పాల్గొన్నారు.

నేడు పట్టభద్రుల సమావేశం

మంగళగిరి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్స్ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు జరిగే సమావేశంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతమ్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, మాజీ ఆప్కో చైర్మన్‌లు పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కళాకారులకు తెనాలిలో ‘రంగస్థల దసరా’

‘వీణా అవార్డ్స్’ నాటకోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణలో సాయిమాధవ్ బుర్రా



బ్రోచర్‌ను ఆవిష్కరించిన సాయిమాధవ్ బుర్రా

తెనాలి: రాష్ట్రంలోని కళారంగంలోని వారికి తెనాలిలో రంగస్థల దసరా ఆరంభమవుతోందని కళల కాణాచి వ్యవస్థాపకుడు, సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. వేదగంగోత్రి ఫౌండేషన్- విజయవాడతో కలిసి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఈనెల 7-12 తేదీల్లో జరగనున్న వీణా నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. జాతీయస్థాయి చతుర్థ సాంఘిక పద్య నాటక, సాంఘిక నాటక, నాటికల పోటీల వివరాలను తెలియజేశారు. తొలిరోజున జిల్లాకు చెందిన నాటకరంగ దిగ్గజాలు వల్లూరు వెంకట్రామయ్య చౌదరి, కొడాలి గోపాలరావు, కన్నెగంటి నాసరయ్య, బెల్లంకొండ రామదాసు శతజయంతి ఉత్సవాల సదస్సు, వారి పేరిట ప్రస్తుత రంగస్థల నటులు/రచయితలకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. మధ్యలో శ్రీదుర్గాభవాని నాట్యమండలిచే శ్రీకృష్ణరాయబారంలో నాటక సన్నివేశ ప్రదర్శన ఉందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు సమకాలీన సాంఘిక పద్యనాటకం, మధ్యాహ్నం 2 గంటలకు సాంఘికనాటకం, సాయంత్రం రెండేసి నాటికల చొప్పున ప్రదర్శనలు ఉంటాయన్నారు. తొలిరోజున పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, విశ్లేషకుడు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తికి ప్రదానం చేస్తారు. ముగింపురోజైన 12న ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని రాష్ట్రంలోని పేరెన్నికగన్న రంగస్థల నటుడు యడ్ల గోపాలరావుకు ప్రదానం చేస్తామని వివరించారు. మళ్లీ కొత్తగా తీసుకొస్తున్న సాంఘిక పద్యనాటకాలతో సహా ఆయా రోజుల్లో ప్రదర్శనలను ప్రజలు ఆదరించాలని డాక్టర్ సాయిమాధవ్ కోరారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కోశాధికారి దేవరపల్లి భవాని, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, షేక్ జానిబాషా, గోగినేని కేశవరావు, అయినాల మల్లేశ్వరరావు, అలపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్త లేబర్ చట్టాలను రద్దు చేయాలి

సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి



నినాదాలు చేస్తున్న సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి

లక్ష్మీపురం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 42 కార్మిక చట్టాలను రద్దు చేసి నూతనంగా ఏర్పాటు చేసిన 4 లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. స్థానిక ఒకటో డివిజన్ మణిపురం ప్రాంతంలో ఏఐటీయూసీ పతాకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర జనాభాకు తగినట్లుగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో పది పంచాయతీలు విలీనం చేసినప్పటికీ పారిశుద్ధ్య కార్మికులను పెంచలేదని, పర్మనెంట్ కార్మికులు రిటైర్డ్ అయిన వారి స్థానంలో ఖాళీలు అట్లానే ఉంటున్నాయని పేర్కొన్నారు. సమ్మె కాలంలో పనిచేసిన కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని, వరదల వల్ల నష్టపోయిన విజయవాడ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుచుటకు పనిచేసిన కార్మికులందరికీ అదనపు జీవితాలు చెల్లించాలని అన్నారు సమావేశంలో బుజ్జి, ఎసురత్నం, ఏరమ్మ, శివ జాన్ నాగరాజు, సామ్రాజ్యం, సుదర్శనం పాల్గొన్నారు.

మనోధైర్యంతోనే క్యాన్సర్‌పై విజయం

అంకాలజిస్ట్ డాక్టర్ ఫణీంద్ర కుమార్

లక్ష్మీపురం: ఆధునిక వైద్య విధానాలతో పాటు రోగి మనోధైర్యం క్యాన్సర్‌పై విజయంలో కీలకంగా నిలుస్తుందని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎస్.ఫణీంద్ర కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్యసభ ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. క్యాన్సర్ వ్యాధి- కారణాలు- చికిత్స' అన్న అంశంపై నిర్వహించిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణాలను పొట్టను పెట్టుకుంటున్న వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనదని వివరించారు. భారత్‌కి క్యాన్సర్ సునామి పొంచి ఉందంటే అతిశయోక్తి కాదన్నారు. సంస్థ సభ్యుల సందేహాలను డాక్టర్ ఫణీంద్ర కుమార్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ రోగులకు విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ ఫణీంద్ర కుమార్‌ను సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమాన్ని సంస్థసభ్యులు టీవీ సాయిరాం సమన్వయం చేశారు. సంస్థ సభ్యులు చల్లా అంజిరెడ్డి, రవిచంద్ర ప్రసంగించారు.

విద్యార్థి దశలో కష్టపడితే భవిత బంగారుమయం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో సుఖాలను వదులుకుంటే భవిత బంగారుమయం అవుతుందని జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు విద్యార్థులను సన్నద్ధం కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం సందర్శించారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో 300 మంది విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో రాధిక మాట్లాడుతూ సమయం అందరికీ ఒకే విధంగా ఉంటుందని, దానిని ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకున్నప్పుడే విజయాన్ని అందుకోగలమని పేర్కొన్నారు. చేసే పనిని ఇష్టంతో చేయాలని, ఏకాగ్రత ఎంతో ముఖ్యమన్నారు. కంఫర్ట్ జోన్ వదిలిపెట్టి కష్టపడితేనే ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించగలరన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ నిపుణుడు జి.ప్రకాష్, గణిత, వేద గణిత నిపుణుడు ఎస్.ఆదినారాయణ స్పీడ్ మాథ్స్ నిపుణుడు శ్రీనివాస్ విద్యార్థులకు పోటీ పరీక్షకు అవసరమైన విషయాల్లో శిక్షణ ఇచ్చారు. మానవత సంస్థ కార్యదర్శి కె.సతీష్, డైరెక్టర్లు ఉప్పాల సంవత్సరాలు, ఎన్.సాంబశివరావు, చావా శివాజీ, కోశాధికారి సాయిరాం, మేనేజర్ సాయికిరణ్, అరుణాచలం పాల్గొన్నారు.